# అనుమానం

## - యస్. ఆర్. చింతపల్లి

కాఫీ పట్టుకొచ్చింది రాధ. ప్రేమగా 'కాఫీ' అంది.

ఆఫీస్ టైమయిన హడావుడిలో కృష్ణారావు రాధ ప్రేమని గుర్తించినట్టు లేదు. చొక్కా తొడుక్కుంటూ ''అక్కడ పెట్టు'' అన్నాడు.

''అబ్బ. తీసుకోండీ'' అంది గారాలు పోతూ.

కృష్ణారావు అప్పుడు గుర్తించినట్టున్నాడు. కాఫీ తీసుకున్నాడు.

రాధ మొఖం చాటంతయింది. బొత్తాలు పెడ్తూ ''ఏవండీ!'' అంది.

ఓ క్షణమాగి, గోముగా కోరింది- ''నన్నునుమానించరూ!''

పోఖ్రాన్‌లో ఆటంబాంబు పేలినంత ఎఫెక్ట్‌లో అదిరిపడ్డాడు కృష్ణారావు. ''అనుమానించాలా నిన్ను?!'' అయోమయంగా అన్నాడు.

తలొంచుకొని ముద్దుగా ''అవునండీ'' అంది.

''అదేం కోరిక!''

''పక్కింటి పిన్నిగారు లేరూ! భలే మంచివారండీ, కలుపుగోలు మనిషి. ఆవిడంటుందీ- కారంలో ఘాటుదనం, సంసారంలో తీయదనం, జీవితంలో అనురాగం చక్కగా వుండాలంటే... అప్పుడప్పుడూ మొగుడూ పెళ్ళాల మధ్య చిటపటలుండాలమ్మా అనీ.''

రాధ గొంతు తగ్గించి, మెల్లగా అడిగింది-

''ఏవండీ! నన్నునుమానించరూ!''

పళ్ళు నూరుతున్నవాడల్లా ఒక్కసారిగా డ్రాప్ అయ్యి, దాదాపు ఏడుస్తున్నట్టుగా-'' ఏమని అనుమానించనే నిన్నూ?'' అని దండం పెట్టేశాడు.

రాధకి ఎక్కళ్లేని కోపం వచ్చింది. కళ్ళల్లోకి నీళ్ళు తెచ్చుకుంటూ, ఛటాల్న లేచి-'' అనుకున్నానండీ అనుకున్నాను. నామీద మీకు ప్రేమ లేదు. లేశమంతయినా లేదు. ఉంటే, ఇట్లా దీనంగా దండం పెట్టి ఊరుకుంటారా? ఏమడిగాననీ! సత్యభామలాగ పారిజాత పుష్పమడిగానా? సీతమ్మ తల్లిలాగా బంగారు లేడి అడిగానా? చిన్నకోరిక! కోరక కోరక కోరాను. అదీ తీర్చకపోతే ఎందుకండీ పెళ్ళీ-పెటాకులు! ఎందుకండీ సంసారం!'' అంటూ విసవిసలాడ్తూ వెళ్ళిపోయింది.

అస్త్రసన్యాసం చేసిన అర్జునుడిలా అయిపోయాడు కృష్ణారావు. తిరిగి మామూలుగా అవటానికి టైం పట్టింది. ఏం చేయాలో అర్థంగాక జుట్టు పీక్కున్నాడు. దిండుని విసిరికొట్టాడు. అక్కడున్న డైరీని విసిరికొట్టాడు. అందులోంచి లెటర్ బైటికి పడిపోయింది. 'ఏంటబ్బా' అనుకుంటూ కవర్ విప్పి లెటర్ చదివాడు. అడ్రస్ చూశాడు ప్రేమతో.. ఫ్రం గోపీకృష్ణ అనుంది.

''రాధా!''

ఆ పిలుపునకు అలిగి పండుకున్న రాధ ఉలికిపడి లేచింది.

వాళ్ళిద్దరు గొడవపడ్తూండగా వచ్చిన కృష్ణారావు మావగారు ఆశ్చర్యపోయి, తలుపు దగ్గరే ఆగిపోయాడు. కిటికీలోంచి చూశాడు.

కూతురు ఏడుస్తోంది.

అల్లుడు మండిపడ్తున్నాడు.

''చెప్పు! ఎవడు? వాడెవడు? ఎన్నాళ్ళనుంచి సాగుతందీ ప్రేమాయణం? ఎక్కడెక్కడ కలుసుకుంటున్నారు



మీరిద్దరూ? చెప్పు..''

రాధ ఏడుస్తోంది. ''నిజంగా అలాంటిదేమీ లేదండీ. ఆ లెటర్ సంగతే నాకు తెలీదు.''

జుట్టు పట్టుకుని-''తెలీదూ తెలీందే ఈ లెటర్ నీ డైరీలోకి ఎలా వచ్చింది?'' అంటూ ఊపాడు.

''అదేం లెటరో చూపించండి.''

''చూపించను..చింపేద్దామనేనా?''

అయ్యో అంటూ రాధ ఏడుస్తూండిపోయింది.

కృష్ణారావు కోపంతో అటూ-ఇటూ పచార్లు చేస్తూ-

''ఏమో అనుకున్నానుగాని, నువ్వింత నంగనాచివనుకోలేదు. నువ్వు ఒలకబోసేదంతా ప్రేమే అనుకున్నాను. నువ్వు చూపించేదంతా అభిమానమనుకున్నాను. కాని, ఇంత వంచకివనుకోలేదు.

''ఎంత ముందు జాగ్రత్త పడ్డావ్! నన్నునుమానించండి, నన్నునుమానించండీ అని పిన్నిగారి మీద వంకపెట్టి, కల్లబొల్లి ఏడుపులు ఏడ్చావు మోసం! అంతా మోసం..'' అంటూ చేతిలో ప్రేమలేఖ పట్టుకొని శివాలెత్తిపోతున్నాడు.

రాధ ఏడుస్తూ ఎంత సమాధాన పరుస్తున్నా విన్పించుకోవటం లేదు.

కిటికీ దగ్గరున్న మామగారికి ''నా అల్లుడేనా?'' అని అనుమానమొచ్చింది హఠాత్తుగా.

లోనికి వెళ్ళడం వెళ్ళడమే అల్లుడిమీద విరుచుకుపడ్డాడు.

''నువ్వింతదాకా వచ్చాకా నేనూరుకుంటాననుకున్నావా? తీసుకెళ్తాను, నా కూతుర్ని తీసుకెళ్తాను. రామ్మా రాధా, రా!'' అంటూ రాధ చేయి పట్టుకొని గబగబ నడిచాడు.

రాధ బిత్తరపోయింది.

కృష్ణారావు ఖంగుతిన్నాడు.

తేరుకునేసరికి, మామగారు రాధని తీసుకొని గేటు దాటేస్తున్నాడు.

కృష్ణారావు గభాల్న పరుగందుకున్నాడు.

''మామ గారూ!'' అంటూ ఆయన చేతులు పట్టుకొని భోరుమన్నాడు.

''మీ కూతురు కోరక కోరక ఓ కోరిక కోరింది. తనని అనుమానించమనీ గగ్గోలు పెట్టింది. ఏం చేయాలో అంతుపట్టలేదు. పెళ్లి తర్వాత నేను రాసిన లెటర్ కన్పించింది. దాంతో ఆమె కోరిక తీర్చే భగీరథ ప్రయత్నంలో పడ్డాను. మీరొచ్చారు''

మామగారికి మతిపోయింది. కూతురివైపు తిరిగి, ''ఇదేం వెర్రికోరికే! అసలు నీకీ, ఆలోచన ఎందుకొచ్చిందే?''

రాధ తలొంచుకొని, కొంగుని వ్రేళ్ళకి చుట్టుకుంటూ ''ప్రేమ ఎక్కడుంటుందో అక్కడ అనుమానం ఖచ్చితంగా ఉంటుందట! ఆ విషయం తెలుసుకుందామని''

''ఎవరూ చెప్పింది? ఆ పిన్నిగారేనా?'' వత్తి పలుకుతూ మరీ అడిగాడు కృష్ణారావు.

బెదిరిపోతూ- ''అవునండీ'' అంది.

అతను కోపం పట్టలేక 'షోలే' లో ధర్మేంద్ర గబ్బర్ సింగ్ అని అరిచినట్టు పి..న్నీ అని అరిచి ఆ ఇంటివైపు పరుగెత్తబోయాడు.

వెనుకనుంచి, రాధ మెల్లగా చెవిలో చెప్పింది ''పిన్నిగారు ఈరోజే ఇల్లు ఖాళీ చేశారండీ'' అనీ.

★